ఏదోటివ్యక్తినుండి సమానమైన ప్రేమను ఆశిస్తుంది ప్రేమ. వ్యక్తిత్వం గుర్తించకపోవడం స్వాభిమానాన్ని రెచ్చగొడుతుంది. స్త్రీ క్షమామూర్తే కావచ్చు. దోషం పునరావృతమైతేమాత్రం మనసు విరిగిపోతుంది. ఋజువైన జీవితపథం వదిలి డొంకలుపట్టాలని మనిషికి కోరిక ఉండదు.

**అప్పుడే వచ్చి** డ్రెస్సన్నా విప్పకుండా పక్క మీద వాలిన రాధకు రూమ్‌మేట్ జానకి గొంతు వినిపించింది- "ఓయ్, రాధా! నీకు ఎక్కడనుండో ఉత్తరం వచ్చింది" అని.

బద్ధకంగా పొర్లింది రాధ. అటునుండి ఇటు దొర్లి "చదివే ఓపిక కూడా లేదు. కాస్త చదివి వినిపిద్దూ" అంది.

వాళిద్దరి మధ్య పెనవేసుకున్న స్నేహాను బంధం అది. అరమరికలు లేవు. పాతిక ఏళ్ళు నిండని వయస్సు వాళ్ళది.

"ఎక్కడినుంచి వచ్చింది, జానీ?" అంది రాధ కళ్ళు తెరవకుండానే.

"బెజవాడట, రాధా. బెజవాడలో నీకు కావలసినవాళ్ళు ఉన్నారని చెప్పనేలేదేం, నాతో?" కొంచెం కినుకగా అంది జానకి.

"జానీ, నాకెవరూ లేరని నీకు తెలుసు. ఏ పేషంటన్నా వ్రాసి ఉంటాడు. చదువు" అంది రాధ జానకి ముఖంవంక ఒకసారి చూసి, తనలో తాను నవ్వుకుంటూ.

గబగబా సంతకం ఉన్నచోట చూసింది జానకి. 'మాధవ్' అని ఉంది. ఆమాటే రాధతో అంది కూడా. ఏదో దుమారం లేచింది రాధ బుర్రలో. చటుక్కున "మాధవ్, మాధవరావు" అంటూ గోణిగి జానకి చేతుల్లో ఉన్న కవరును, కాగితాలను తను తీసుకొంది. ఈ హఠాత్ప్రవర్తనకు జానకి ఆశ్చర్యపోయింది. ఆత్రుతగా చదువుతున్న రాధ ముఖంలోకి తరిచి తరిచి చూడ సాగింది. ఆమె ముఖంలో వ్యక్తమవుతున్న భావాలను చదవలేకపోయింది. రాధ చెబుతుంది లెమ్మని పక్కనున్న ఏదో పుస్తకం తీసి, పేరుకు పేజీలు తిరగవెయ్యడం మొదలుపెట్టింది.

"ఈ ఉత్తరం చదువు, జానీ" అంటూ జానకి చేతికి ఉత్తరం ఇచ్చింది రాధ. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరగడానికి కారణమైన ఆ ఉత్తరాన్ని పైనుంచి కిందదాకా ఒక్క గుటకతో చదివింది జానకి.

బెజవాడ.

"డియర్ రాధీ,

నే నెవరో గుర్తించే ఉంటావు ఈ పాటికి. ఎటువంటి పరిస్థితుల్లో నేను ఇల్లు విడిచి పారి పోయానో నీకు తెలుసు. తెలిసీ నన్ను నిందిం చినా, నాకేం బాధ లేదు. రాధా, అప్పుడు చేసింది పొరపాటే. ఒప్పుకుంటున్నాను. ఇంకా కోపమా? మూడేళ్ళలో చాలా మారిపోయి ఉంటావు. నన్ను నేను నమ్మించి మోసపుచ్చుకుంటు న్నానా, రాధీ? నీవలా అనుకోవని నాకు తెలుసు. నిద్రలేని రాత్రిళ్ళు నాకు ఎంత భారంగా గడిచాయో, నేను వివరించలేను. మన ప్రణయ ఫలితంగా పుట్టిన పాపను చూడాలని ఆత్రుతగా ఉంది.

ఇప్పుడు నిన్ను పెళ్ళి చేసుకోవడానికి ఎవరూ అడ్డురాలేరు. చాలా డబ్బు సంపాదించాను. మనం ముగ్గురమూ ప్రపంచానికి దూరంగా, ఎవరూ ఉండనిచోటికి పారిపోదాము. నిన్ను విడిచి ఒక్క క్షణమైనా ఉండలేనిక. ఈ మూడేళ్ళూ ఎలా గడిపానో భగవంతుడికే తెలియాలి. నేను బుధ వారం నాటికి వస్తాను.

ఈ ఎడ్రసు ఎలా సంపాదించానో తెలుసా? నాకు ఇక్కడ ఒక స్నేహితుడు ఉన్నాడు. అతని కాబోయే భార్య రుక్మిణి రాజీనామా ఇచ్చి వచ్చే సింది. మీ గ్రూప్ ఫోటో చూపించింది. నేనిన్నాళ్ళూ నీకోసం తపస్సు చేశాను. నా తపస్సు ఈనాటికి ఫలించింది. నా రాకను నిరాకరించవు కదూ? ఏమేమో వ్రాయాలనుకొన్నాను. క్షమాపణలు తెలుపుకోవాలనుకున్నాను. కానీ అటు ఆమాటలూ వ్రాయలేకపోయాను; ఇటు నిన్ను లాలించనూ లేకపోయాను. అన్నీ నీ సమక్షాన చెబుతాగా? రాధా, కలుసుకున్నప్పుడు మాటలు పెకిలి వస్తాయా?

చాలా పెద్ద ఉత్తరం వ్రాశాను. ఇక ఉంటాను. మనం కలుసుకొనే మధుర క్షణం కోసం ఎదురు చూస్తాను.

నీ
మాధవ్."

ఉత్తరంమడిచి అంది "ఏం, రాధా! ఇన్నాళ్ళకు గుర్తుకు వచ్చావన్నమాట ఆ మాధవుడికి. నిజంగా నిన్న మొన్నటివరకు కలిసి మెలిసి తిరిగినవాళ్ళన్నా అలా వ్రాయలేరు..." మాట లింకా పూర్తికాక పూర్వమే రాధ ఏడుస్తున్నదని గుర్తించింది జానకి. ఎగిరి ఎగిరి పడుతున్న ఆమె గూళ్ళు ఆమె ఎంత వ్యధిత హృదయ అయి ఏడుస్తూందో తెలుపుతున్నాయి.

తలగడ నంటిపెట్టుకున్న రాధను ఆప్యా యంగా తట్టి "లే, రాధా" అంటూ ఓదార్చ బోయింది జానకి. రాధకు ఆమె మాటలు విన పడడం లేదు. తను తల్లికావడం, అతనూ తనూ ఎలా ప్రేమించుకున్నదీ, ఆనాటి లాలింపు మాటలూ, అతని పలుకుల్లో తీయదనం— ఒకదాని తరువాత ఒకటి గుర్తుకు వచ్చాయి రాధకు.

**కుమారి ఎస్. జ్యోతి**

అతను ఆ రాత్రి ఇంటినుండి వెళ్ళిపోతా డనగా మల్లెపొద నీడలో హాయిగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్న సంఘటన లీలగా కళ్ళముందు మెదిలింది.

అతని క్రాపును చిలిపిగా చెరుపుతూ "మాధవ్!" అంది తను. అతను కూడా తన చేతిని తీసుకొని మృదువుగా నొక్కుతూ "ఇవాళ నీవైఖరే అదోలా ఉంది, రాధీ! ఏమన్నా అన్నారా, ఇంట్లో, మన విషయం గురించి?" అన్నాడు.

"ఏమీ అనలేదు. కాని నీతోనే ఒక విషయం చెప్పాలి" అంది తడబడుతున్న మాటలతో.

"దేవిగారి అభీష్టమేదో సెలవీయండి" అన్నాడు కళ్ళు అందంగా తిప్పుతూ, తన చెక్కి ళ్ళను మెల్లగా నిమురుతూ.

"ఏమీ లేదు, మాధవ్. నాకేదో కంగారుగా ఉంది. తల్లిని కాబోతున్నానని అనుమానంగా ఉంది" అంది దీనంగా. అతని ముఖ భంగిమలను చూడాలనుకుంది కాని, చూసే ధైర్యం తనకు లేకపోయింది.

"నిజంగానా, రాధీ? నీవు చెప్పింది నిజ మేనా?" అని ఒక్క ఉదుటున తన చేతులు పట్టుకొన్నాడు.

"నే నసత్యం చెప్పడం లేదు, మాధవ్!" అంది తన క్షణికావేశానికి చింతిల్లుతూ.

మాధవ్ ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. తను పోసుకోలేక ఇంట్లో కూర్చున్నాడు. సంపాదించి పెడుతుంటే తింటున్నాడని సంపాదనపరుడైన అన్నగారు ఛీత్కారం కావిస్తూంటే, తెలివి తేటలులేక, పోసుకోలేక, అసమర్థుడయ్యాడే కొడుకు—అని తండ్రి బాధపడుతూంటే ఇక మధ్యలో ఇదొకటా అని చింతిల్లాడు.

"ఆశ్చర్యం ఏమిటి, మాధవ్? పిన్ని పసి కడుతుంది. నాన్నగారికి చెబుతుంది. ఆ తరువాత నాపాట్లు...."

"ఆపు, రాధీ. నేనేం నిన్ను అన్ని బాధలకు లోను చేస్తాననుకుంటున్నావా? ఇవాళే నాన్న గారితో మాట్లాడి వివాహం జరిగేటట్లు చూస్తాను. లేకపోతే రిజిస్టరు మారేజి చేసుకో వచ్చు. అనవసరంగా బాధపడకు" అని మరీ మరీ చెప్పి రాధ వెళ్ళిందాకా చూసి దిగులుగా కూర్చుండి పోయాడు.

గాలి చల్లగానే వీస్తున్నా, వెన్నెల విరియ గాస్తున్నా ఒళ్ళంతా చెమటలు పట్టినట్లు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. ఏదో నిర్ణయించు కున్నవాడులా ఇంటికేసి దారి తీశాడు.

రాధకు అమ్మ లేదు. రాధ ఆలనా పాలనా చూసుకుంటుందని ద్వితీయ వివాహం చేసు కున్నాడు రాధ తండ్రి. కాని ఆయన ఆశ నెరవేరలేదు. ఆమె భర్త మనసు తనవైపు లాక్కుంది. రాధకు తిండి, బట్ట మాత్రం ఇచ్చేది. అసలు సంగతి తెలిసి రాద్ధాంతం పెట్టింది. "రేపు నా కూతురికి పెళ్ళి ఎలా అవుతుంది?" అంటూ దీర్ఘాలు తీసింది. అసలు తండ్రి ప్రేమ, తల్లి ప్రేమ కరువైనందుకు మాధవరావు ప్రేమతో

చిక్కుకొంది. అతనే ప్రథమ వ్యక్తి ఏమో, రాధ అంటే పట్టించుకొన్నవాడు. వాళ్లిద్దరూ ఉద్రేకానికి లోనయిన రోజు కూడా పొరపాటు చేశామేమో అని తలచలేదు. అది ప్రకృతి ధర్మమే అనుకున్నారు. మాధవ్ అసలే పట్టించుకోలేదు. మాధవ్‌కోసం వెళ్లింది—'ఇద్దరం కలిసి వెళ్లిపోదాము, మనలను అర్థంచేసుకొనే లోకానికి' అని చెప్పడానికి. కాని అక్కడా తలవంచుకోవలసి వచ్చింది, విధి విధించిన క్రూర శాపానికి.

"వాడిని మాకు కాకుండా చేశావు" అని ఏమేమో తిట్టారు. తిరిగి ఇంటి గడప తొక్కబోయింది, అవమానం పొందిన వ్యథిత మానస



# విశ్వావసు
# ఉగాది నవలల పోటీ

## 4,500 రూపాయల బహుమతులు

ప్రతిఏడాదివలెనే విశ్వావసు ఉగాది సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక నవలలపోటీ నిర్వహిస్తున్నది.

**క్రోధి ఉగాది నవలల పోటీలో 3.500 రూపాయల బహుమతులు ఇచ్చాము ఇతోధికమైన ప్రోత్సాహం ఇచ్చే నిమిత్తం విశ్వావసు ఉగాది నవలల పోటీలో 4,500 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.**

తెలుగు రచయితలు ఈ అవకాశం వినియోగించుకొని, పాఠకులకు ఉత్తమమైన నవలలు సమర్పించాలనే మా సంకల్పం సఫలం కావడానికి తోడ్పడాలని కోరుతున్నాము.

## మొదటి బహుమతి 2,500
## రెండవ బహుమతి 1,250
## మూడవ బహుమతి 750

**పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు :**

1. రచన 250 పావుతావు కాగితాలకు మించరాదు.
2. సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. స్వీయ రచనలే కాని అనువాదాలు పంపరాదు.
5. బహుమతి పొందని నవలలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. రచన పంపేటప్పుడు కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అనిస్పష్టంగా వ్రాయాలి.
7. బహుమతి పొందని రచనలలో ప్రచురణార్హం కాని వాటిని తిప్పి పంపే నిమిత్తం తగుమాత్రం తపాలా బిళ్ళలు అంటించిన, చిరునామా కలిగిన కవరు జతపరిచి పంపవలసి ఉన్నది. లేకపోతే వాటిని తిప్పి పంపడం జరగదు.
8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2'కు పంపాలి.

**బహుమతి పొందిన నవలల ప్రచురణ ఉగాది ప్రత్యేక సంచికలో ప్రారంభం అవుతుంది**

**ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరితేది — 1965 ఫిబ్రవరి 28**


# ఎండమావి

అయి.

సవతి తల్లి వింతగా నవ్వింది. "ఒకసారి గడపదాటి వెళ్ళావు. దానితోపే గడప మళ్లీ తొక్కే అవకాశాన్ని కోల్పోయావు" అంది. "క్షమించ"మని అడుగుదామనుకొంటే ఆ అవకాశం ఇవ్వకుండానే "నీవూ నీ అమ్మతో చచ్చావనుకుంటాను. దాని కడుపున పుట్టిన దాని కిటువంటి బుద్ధులా? పోవే" అన్న తర్వ్రడిగొంతుకు భయపడింది.

మొండిగా రైలెక్కింది. అందరూ తన్ను దోషిలా చూస్తున్నారని భూదేవి మీదకు క్రుంగి నడిచేది. అనాథాశ్రమంలో చేరింది. ఆ పిల్లలకు సేవచేస్తూ కాలం గడిపింది. అక్కడ తన వయసువాళ్ళు తనను వెక్కిరిస్తున్నారని బాధపడేది, అసలు కారణం అడిగితే చాలు, వెర్రిదానిలా నవ్వేది. మాధవ్‌ను మొదట్లో ద్వేషించింది, అసహ్యించుకొంది. కాని ఆపని కూడా మానుకొంది. 'కర్మ' అని సరిపెట్టుకొంది. నెలలు నిండాయి. ఆశ్రమంలోనే ప్రసవించింది. కాని పుట్టిన పాప గంటలలో మరణించింది. ఆ పాప చనిపోయినపుడు మాత్రం ఏడిచినా, 'భగవంతుడు మేలు చేశాడు. లేకపోతే ఆ పిల్ల భవిష్యత్తెలా ఎన్ని వంకరలు తిరిగేదో' అని సంతోషించింది.

అనాథాశ్రమంలోనే చదువుకున్న ఒకామె డాక్టరు వృత్తిలో ప్రవేశించింది. రాధకు అన్ని విషయాల్లోనూ సలహాలిస్తూ ప్రాణ స్నేహితురాలులా ప్రవర్తించేది. ఆమె అవస్థకు తెగ జాలిపడేది. ఎస్. ఎస్. ఎల్. సి. పాసై ఉండి ఊరికినే ఎందుకు ఉండాలని నర్సు ట్రెయినింగులో చేరమంది. ఉన్నతమైన చదువు చదివిందని గౌరవించేవాళ్ళు అధికారులు కూడా. అందుకనే నర్సు ట్రెయినింగుకు రాధను పంపడానికి అడ్డుపెట్టలేదు. అణకువ, వినయం రాధ సుగుణాలు. తను పట్టుదల పెంచుకొని చదువుతున్నది, జీవితపుటంచులను చేరి హాయిగా ఊపిరి పీల్చుకొనేటందుకు.

కాకినాడలో సీటు దొరికింది. అక్కడకు వచ్చేసింది. జానకి స్నేహితురాలయింది. అనాథ అని తెలిసి మరింత దగ్గరకు వచ్చింది. సానుభూతి పెంచుకొంది. ప్రేమానురాగాలు పంచిపెట్టింది. ఎవరితోనూ ఎక్కువగా పట్టించుకోని రాధ జానకికి బహిఃప్రాణమైంది. జానకికి తన జీవిత కథను వివరించింది. జానకి ఎంత జాలి కలదో, అంత కోపం ఉన్న వ్యక్తి కూడాను. "మాధవ్ కనపడినప్పుడు వదలకుండా తంతే సరి" అంది చిన్నపిల్లలాగా.

"పిచ్చి జానీ, నీ కసలేం తెలీదు. ఒకళ్ళని తంతే మన కొరిగేదేమిటి?" అంది ఆమె మెడ

మీదనుండి చేతులు వేసి తనమీదికి లాక్కుంటూ.

"నేనేం మాధవ్‌ని కాను" అంది చిలిపిగా తన చెక్కిలి ఆమె చెక్కిలిని చేర్చి.

"మాధవ్ అసహాయుడు, జానీ! ఒకరిని మోసపుచ్చే స్వభావం కాదు" అంది రాధ.

"ఆ బలహీనతే ఆడదాని కొంపలు ముంచేది" అంది జానకి.

'ఇంకా చదవాలి, కోర్సు పూర్తికావాలంటే. ఇంకా రెండేళ్ళు గడవాలి. అప్పుడు, తానొక గమ్యస్థానాన్ని చేరేది.' ఆలోచనలింకా కొనసాగుతూనే ఉన్నాయి. 'మాధవ్ వస్తాడు. పాప ఏదీ అంటాడు. తాను పెద్దగా నవ్వాలి. ఎందుకు? మర్యాదగా చెబుతుంది. వెళ్లిపోదాము రమ్మంటాడు. తాను మొండికేస్తుంది. బుజ్జగిస్తాడు. ఏడిపించి ఏడిపించి వెళ్ళాలి. హుం! ఎందుకు వెళ్ళాలి? వెళ్లను: వెళ్లను' అనుకుంటూ అల్లో చిస్తూంది. కన్నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి. కళ్ళు ఏడ్చి ఏడ్చి ఉబ్బాయి. తలనొప్పిగా కూడా ఉన్నట్లనిపించింది.

"రాధీ" అంటూ వచ్చింది జానకి. రాధ మనసు బాధపడుతున్నదని తెలిసి మధ్యలో తానేవన్నా అంటే మరింత బాధపడుతుందని వెళ్లిపోయింది. షాపింగ్‌కు వెళ్లివచ్చింది. వచ్చి ఆప్యాయంగా పక్కన కూర్చుని "ఏం, రాధీ, అన్నం ఎందుకు తినలేదు. పిచ్చిదానా! ఏడిస్తే మనసుకు ఊరట కలుగుతుందా, చెప్పు? నేను కూడా ఏడుస్తా" అంది.

ఆమె బలవంతంమీద రాధ కాస్త అన్నం తిని పడుకుంది. కాని ఆలోచనలు వెంటాడటం మానలేదు. నిద్రరాదు. ఏదో వెలువరించలేని బాధ, అర్థంకాని సమస్యలు.

ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. దుడుకు స్వభావంకల జానకి మాధవ్‌ను పొరబాటున ఏమన్నా అంటుందేమో అని ముందే ఒప్పించుకొంది అతనినేమీ అనవని.

గుర్తు పట్టగలనా, లేదా అని ఆలోచిస్తున్న రాధకు మాధవ్ ఎదురుగా కనిపించాడు. ఒకరి నొకరు గుర్తుపట్టారు. ఆమె ముఖంలో ఒక్క దరహాసచంద్రికమాత్రం, అదీ అస్పష్టంగా కనపడింది. మాధవ్ అనుకున్నాడు, తాను కనపడీ కనపడడంతోటే వచ్చి ఎక్కడలేని ఆనందంతో తనపైవాలుతుందని. అతని ఆశ నిరాశే అయింది.

"రాధీ" అంటూ ముందుకువచ్చిన మాధవ్‌ను జానకి ఏహ్యంగా చూసింది. రాధ కొద్దికాలం అప్రతిభురాలై, తేరుకుని "కులాసానా, మాధవ్? అలా కూర్చుందాము" అంటూ లాన్స్‌లోకి నడిచింది. జానకి రాధను అనుకొని కూర్చుంది. రాధ జానకిని పరిచయం చేసింది.

మాధవ్ చూపులు నిలువునా పరీక్షిస్తున్నాయి. ఒకప్పుడు ఆ చూపుల తూపులకు పరవశించి మధురస్వప్నాలలో తేలియాడింది. ఆ కన్నులలోనే కలకాలం కాపురం చేయాలని వాంఛించింది. కాని విధి అందుకు అంగీకరించలేదు.

మౌనాన్ని భరించలేక "పాప ఎక్కడుంది?" అన్నాడు. ఆత్రుతగా జవాబుకోసం ఎదురు చూస్తున్నాడు.

అప్రయత్నంగానే ఆమె కళ్ళు చెమర్చాయి. "పాప పుట్టింది కాని, అప్పుడే మనల్ని వది లేసింది" అంది రాధ రుద్ధమైన కంఠంతో.

ఏడుపు స్వరంతో "పాప లేదా?" అన్నాడు మాధవరావు.

వారిద్దరి మధ్య తానెందుకని ఇవతలకు వచ్చేసింది జానకి. మాధవరావు చెప్పాడు: "పారిపోయి వచ్చేసిన తరువాత కనీసం నీకైనా చెప్పి ఉండాల్సిందని బాధపడ్డాను. ఉత్తరాలు నీకూ వ్రాశాను. నాకు జవాబు రాలేదు. అన్నయ్య ఇంటి గడప తొక్కలేదు. కొన్నాళ్ళు రిక్షాలాగాను. జబ్బుపడ్డాను. ఆస్పత్రిలో చేరాను. ఒక స్నేహితుడు అదృష్టవశాత్తూ కనపడ్డాడు. కొట్టులో ఉండమన్నాడు. సొంత వ్యాపారం పెట్టానిప్పుడు. చేతినిండా డబ్బుంది" అన్నాడు.

"క్షమించు, మాధవ్! అవన్నీ ఎందుకు చెబుతున్నావో అర్థం చేసుకున్నాను. కాని....." ఆ తరువాత చెప్పలేకపోయింది.

"అదేమిటి, రాధీ? నీవు ట్రెయినింగులోనే ఉండవచ్చు. నాకేమీ అభ్యంతరం లేదు. కానీ నిన్ను నామూలాన ఇక బాధపడనివ్వను" అన్నాడు రాధ చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ.

రాధ మెల్లగా విడిపించుకుంటూ "ఆ రాధ కాదు ఈ రాధ" అంది.

"కోపం వచ్చిందా, రాధీ? రాకేం చేస్తుంది లే? నాది పొరపాటే అని ఒప్పుకుంటున్నానుగా? విచక్షణాజ్ఞానం లేక వదిలివేసి వెళ్లాను. ఆ తరువాత నేనెంత బాధపడ్డానో తెలుసునా? నిన్ను పోషించగలను ఇప్పుడు" అన్నాడు మాధవరావు, ఏమంటుందో అని ఆసక్తిగా ఆమె వంక చూస్తూ.

ఒక్కసారి పెద్ద కళ్లను మరింత పెద్దవిగా చేసి చూసింది.

"ఆదేం, అలా ఆశ్చర్యంగా చూస్తున్నావు? నమ్మశక్యంగా లేదా? నమ్ము నమ్ము, రాధీ! నిన్ను చూడగానే ఏవేవో చెప్పాలని అనుకున్నాను. కాని ఒక్కటీ గుర్తు రావడంలేదు. మాటలసలే పెకిలి రావడంలేదు. నీవు నన్నేమన్నా అంటావేమో అని, నిరాదరిస్తావని అనుకున్నాను. కాని ఆ రాధ మారలేదని ఇప్పుడు తెలిసి వచ్చింది" అన్నాడు మాధవరావు.

"పోనీ, మాధవ్! గడిచిన రోజులు తలుచుకొని బాధపడడం ఏం లాభం? నిస్సహాయుడివి నీవుమాత్రం ఏంచేయగలవులే. జీవితంలో ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్నాను. ఈ అవకాశంకోసమే ఎదురు చూశాను. నేటికి లభించిందది" అంది సంతోషసాగరంలో తేలుతూ.

"విజిటర్స్ టైం అయిపోయింది, మాధవ్. వెళ్లిపోవాలి" అంది రాధ ఇక ఉంటే తిట్లు తప్పవన్నట్లు. మాధవ్ లేచి వెళ్తూ "రాధీ, తయారుగా ఉండు. రేపు వస్తాను" అన్నాడు పెదవులు అందంగా కదుపుతూ.



బక్కడొక్కల ప్రాణి

చిత్రం: ఎస్. అబ్దుల్లా (వలకుర్తి)

వికలమయిన మనస్సుతో గదికి వచ్చింది. జానకి అడిగింది—"ఏమన్నాడే, నీ మాధవుడు?"

అని. జరిగిందంతా చెప్పి "నాకేం పాలుపోవడం లేదు. నీవేం చెబితే అది చేస్తానే" అంది రాధ పక్కమీదికి అసంతృప్తితో ఒరిగిపోతూ.

"నీ వతన్ని ప్రేమించగలిగితే నిరభ్యంతరంగా పెళ్లిచేసేసుకో, రాధా! ఎప్పటికైనా తీర్చుకోవలసిన సమస్యేగా?"


మలబార్ గ్లోరీ సబ్బు
ప్రరిశుభ్రమైన అతి మనోహర
మైన చర్మసౌందర్యానికి
దీని సువాసన ఉల్లాసకరం!
దీని నాణ్యత అత్యుత్తమం!
ఇది మలబార్ గ్లోరీ సబ్బు!
గత 30 సంవత్సరములనుంచి
సబ్బులతో రాణి
MALABAR GLORY SOAP
VEGETABLE SOAP WORKS
గ్లోరీ
IS:284
ISI
ఆరు బిళ్లలు గల బహుమతి
పెట్టెలో కూడ లభించుచున్నది.
వెజిటబుల్ సోప్ వర్క్సు. కాలికట్

"జానకీ, మునుపటి ప్రేమ అతనిలో ఉందో లేదో తెలియదు కాని, నాలోమాత్రం అసలు ప్రేమ లేదు."

జానకి ఆమాటతో ఇక ముందుకు సాగలేక పోయింది. రాధకు ఆలోచనలతో తలనొప్పి వచ్చింది. గది కదలలేదు. జానకికి ఏమీ పాలు పోలేదు.

అనుకోకుండా మాధవ్ ఊడిపడ్డాడు. అతనిలో ఏమీ లోపంలేదు కాని, తనలోనే ఏదో లోపం ఉందనిపించింది రాధకు. 'తన జీవితం ఇక ఒకరికింద నలిగిపోకూడదు. తాను జీవించినంత కాలమూ తన జీవితం మానవసేవకే అంకితం చెయ్యాలి' అని నిర్ణయించుకొంది ఒకప్పుడు. ఇప్పుడా నిర్ణయానికి తాను మరో అర్థం వెతుక్కుంటూ, పెళ్ళి చేసుకొని జీవితంలో సుఖాన్ననుభవించాలి.

బట్టలు సర్దుకుంటున్న రాధతో జానకి అంది— "ఏమి నిశ్చయించుకొన్నావు?" అని.

"వెళ్ళదామనుకొంటున్నాను."

జానకికి అసలు నమ్మకం లేదు. రాధ మనస్తత్వం ఆమెకు తెలుసు. ఏదీ ఆలోచించనిదే ఒక నిర్ణయానికి రాదు. వస్తే ఆది ఆచరిస్తుంది. జానకి మళ్ళీ అంది: "అన్నీ ఆలోచించుకున్నావా?"

"ఆ" అంది రాధ.

"అతనివెంటవెళ్ళితే నీకు తృప్తిగా ఉంటుందా, రాధా? మాధవ్‌తో నీ జీవితం కొత్త చిగుళ్ళు తొడుక్కుంటుందని నీకు నమ్మకం ఉందా?" అంది జానకి.

ఆ మాటతో చప్పబడిపోయింది రాధ. అతను వచ్చేవేళ దగ్గరయ్యేకొద్దీ ఆమెలో నిరాశ ఎక్కువవుతున్నది. "నేను జీవితంలో స్థిరపడగలననే ఆశ బలపడడంలేదు. ఒకసారి తప్పటడుగు వేశాను. ప్రస్తుతం కడుక్కున్న కాలు మళ్ళీ బురదలో కూర్చుకోవడమే అవుతుందేమో అని భయంగా ఉంది" అంది రాధ. జానకి సమాధానం ఇవ్వలేదు.

ఏదో నిర్ణయించుకున్నట్లు ఒక జాబు వ్రాసింది. తృప్తిగా నిట్టూరుస్తూ దాన్ని జానకి చేతిలో పెట్టి "జానీ, మాధవ్ రాగానే ఇచ్చి వచ్చెయ్యి. పోనీ. ఏమంటాడో చూడు" అంది. జానకి ఆ కాగితం మడిచి తన బాగ్‌లో పెట్టుకొంది.

* * *


"జానకిగారూ, రాధ ఏదీ?" అన్నాడు మాధవరావు నలువైపులా కలయజూసి.

"ఇదిగో, ఈ ఉత్తరం మీ కిమ్మంది" అని జానకి అందించింది వణికే వేళ్ళతో.

ఆత్రుతగా విప్పి చదువుకున్నాడు.

"పూజ్యులయిన మాధవ్‌గారికి,

నిన్న మీరు వెళ్ళిన తరువాత చాలా ఆలోచించాను. అప్పటి మీ రాధిలాగే మారిపోదామనుకున్నాను. కాని మనస్సు అందుకు అంగీకరించలేదు. పువ్వు చెట్టున ఉన్నపుడే అందంగా ఉంటుంది. అది వాడిపోయి రాలిన తరువాత తిరిగి దాన్ని చెట్టులోపెట్టి శోభింపచెయ్యడం వల్ల కృత్రిమమైన అందాన్ని పైకి తెచ్చి పెట్టయి, హాస్యాస్పదంగా ఉంటుంది. పూర్వము



దీపజ్యోతి

కాలేజిలో ప్రతి రోజూ చురుకుగా ఉండడం ముఖ్యం....

టినోపాల్ అదనపు తెల్లదనం యిస్తుంది

తెల్ల బట్టలు మరింత అందంగా ఉంటాయి



కాలా చురుకైన పిల్ల. కాలేజికి గర్వకారణం. బాగా చదువుతుంది. చక్కగా తయారవుతుంది. ధగధగ మెరిసే తెల్లబట్టలు ప్రతిరోజూ ధరిస్తుంది-అందరి తెల్లబట్టలకంటే తెల్లటివి! కారణం?—టినోపాల్!




ఆ ఖరున ఝాడించేటప్పుడు మీ తెల్ల బట్టలకు కొద్ది టినోపాల్ కలిపితే—చీరలు, ఫ్రాక్‌లు, చొక్కాలు, లాగులు, దుప్పట్లు—అన్నిటికీ ఎంతో అద్భుతమైన వ్యత్యాసం కలుగుతుంది. అయితే దీనికయ్యే ఖర్చు ఎంత? బట్టకి ఒక్క పైసా కూడా కాదు. అందమైన తెల్లబట్టలకోసం ప్రతిరోజూ టినోపాల్ వాడండి—చురుకైనవాళ్ళు ప్రతిచోటా ఎన్నిక చేసేది దీన్నే. టినోపాల్ నూలు బట్టలకైనా, మరేబట్టలకైనా ఏవిధమైన హానీ చెయ్యదు. ఎందుకంటే యిది ఆధునిక సైంటిఫిక్ పద్ధతిలో తెల్లబట్టలకు అదనపు తెల్లదనం యిస్తుంది.

టినోపాల్. జె.ఆర్. గైయిగి ఎస్.ఎ. బాల్. స్విట్జర్లెండ్ వారి రిజిస్టరు చేయబడిన ట్రేడ్‌మార్క్. సుహృద్ గైయిగి లిమిటెడ్. పి. ఒ. బాక్స్ 965 బొంబాయి-1. బి.ఆర్.

Shilpi SGT. 123 Tel.

# ఎండమావి

అందం రాదు. నేనూ అంతే. నా లోపమే కావచ్చు. రాలిపోయిన పువ్వును చేబడతానన్నారు. మీ ఆదరానికి సర్వదా కృతజ్ఞురాలిని. మీ ఆదరానికి అర్హురాలిని కూడా కాను. మానవసేవ చెయ్యడంలో ఉన్న ఆనందం, తృప్తి ఒకరికి భార్యగా కర్తవ్యం నెరవేర్చడంలో కలగవు. నా అభిప్రాయం అలా బలపడింది. ఒకప్పుడు నాలో ప్రేమరసం పొంగి పొరలింది. మీకే అర్పించాను తొలిసారిగా. మిగిలింది నా రోగులకు పంచి పెట్టేశాను. ఈ గడిచిన కాలంలో రాధగా మాత్రమే మిగిలాను. ఇక నానుండి మీరు పొందగలిగే సుఖం ఏమీ లేదు. నేను ఇవ్వగలిగిందంత కంటేనూ. ఇదివరకు నాకొక గమ్యం లేదు. నట్టనడి సముద్రాన తుఫానులో నన్నొంటరిగా వదిలేశారు. అందుకు మిమ్మల్ని తప్పు పట్టలేదు అప్పుడు. ఇప్పుడు కూడా మిమ్మల్ని నిందించలేను. ఇక వ్రాయవలసిన వేమీ లేవు. మిమ్మల్ని వివాహం చేసుకొమ్మని కోరడంలో పొరబాటు లేదనుకొంటాను. అహర్నిశలూ మీ క్షేమమే కోరే నన్ను క్షమించి మరిచిపోండి.

రాధ.''

జానకి అతని ముఖంలో మారే రంగులను చూస్తూ నిలబడింది. పర్యవసానం ఏమిటో అని ఎదురు చూస్తూంది. రాధ బయట నిలిచి ఉన్న సంగతి మాధవ్‌కు తెలియదు.

అతను ఆ ఉత్తరాన్ని నలిపి గోడకువేసి కొట్టాడు. జానకికేసి జుగుప్సాకరమైన చూపులతో కోపంగా చూస్తూ ''ఛీ! ఆడవాళ్లందరూ ఇంతే. చంచలమైన మనస్సు గలవారు. నిన్న అంత ప్రేమగా మాట్లాడింది. ఈనాడు ఆ రాధి కాను అంటూ వ్రాసింది. ఇన్నాళ్లూ ఎవరికోసం ఇంత కష్టపడ్డానో ఆమె, నా కష్టాన్ని గుర్తించలేదు. నా అర్థింపును తోసిపుచ్చింది. రాధ అప్పుడు, ఇప్పుడు కూడా నాలో తుఫాను రేపింది. ఆడదనిపించుకొంది'' అని విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయాడు. జానకి ఆశ్చర్యపోయింది, రాధ నోటివెంట రావలసిన మాటలు మాధవ్ పలికినందుకు.

బయటనుండి విన్న రాధ వచ్చి మాధవ్ మాటలకు అచేతన అయి నిలబడిన జానకి భుజంపై చేయివేసి ''జానీ, జీవితం అంటే ఇదే సుమా! ఎండమావులు, సుఖదుఃఖాలు, విపరీతమైన అగాధాలతో నిండి ఉంటుంది. అపార్థాలకు, అనర్థాలకు గమ్యం. నా జీవితం తెల్లవారింది. మరోసారి నేను బురదలో దిగబడకుండా రక్షించినందుకు నేను నీకు సర్వదా కృతజ్ఞురాలిని. నరక కూపంలోకి తెలిసీ వెళ్ళుతున్న నన్ను ఆపావు'' అంది.

విజయానందోత్సాహాలతో, ఇసుమంతైనా ఖేదపడకుండా అన్న రాధ మాటలకు జానకి కనులెత్తి ఒక్కసారి చూసింది.

[illegible] 'జీవితం, జీవితం'